www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 27 | ఆగస్టు | 2025 పేజీలు : 8

## బోనస్ కోసం రైతన్నల ఎదురుచూపు

-రూ. 3.50 కోట్ల బకాయిలు



2 లో

# కొలువు దీరనున్న గణపయ్య



-మండపాలకు తరలుతున్న గణనాధులు
-భారీ సెట్టింగ్‌ల నడుమ పందిళ్లు
-చవితికి వర్షపు దెబ్బ

ప్రజాపక్షం/ ఖమ్మం : గణపతి ప్రత్యేక పూజలకు వేళ అయింది. విఘ్నాలను హరించే విఘ్నేశ్వరుని జన్మదినమే వినాయక చవితి. గణేష్ ఉత్సవ మంటే ఓ సందడి. గతం కంటే భిన్నంగా గణేష్ నవరాత్రోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. భాద్రపద మాసంలో వచ్చే తొలి పండుగ వినాయక చవితి. ఈ ఏడాది



ఆగస్టు 27 బుధవారం నాడు ఈ పండుగను నిర్వహిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడాలు లేకుండా చవితి పందిళ్లను భారీగా ఏర్పాటు చేశారు. పలు చోట్ల భారీ గణనాధులను పూజలకు సిద్ధం చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు విశిష్ట పూజలు నిర్వహించేందుకు భారీ సెట్టింగ్‌ల నడుమ చవితి పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నాడే గణనాధులు మండపాలకు తరలుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సమరాన్ని దృష్టిలో ఉంచుకుని పోటా పోటీగా వినాయక చవితి ఉత్సవాలను

మిగతా 2లో..

## ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

2 లో



-లాభసాటి వ్యాపారాలను ప్రారంభించాలి
-మహిళా ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ఎనిమిది మంది మావోయిస్టులు లొంగుబాటు



2 లో

## పర్యావరణ పరిరక్షణ దిశగా
# అడుగులేద్దాం



ప్రజాపక్షం/కొత్తగూడెం : మట్టి విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాన్ని జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ వైపు అడుగులేద్దామని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో,

మిగతా 2లో..

మట్టివిగ్రహాలతో చవితి ఉత్సవాలు జరుపుకుందాం
- కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని

# కొలువు దీరనున్న గణపయ్య

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినప్పటికీ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంది.

**మట్టి విగ్రహాలకు విస్తృత ప్రచారం :**

ఎప్పటి మాదిరిగానే మట్టి విగ్రహాలకు ఈ ఏడాది విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఉచితంగానే మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు మట్టి విగ్రహాలను ప్రకృతి పర్యావరణం దృష్ట్యా వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రశాంతంగా ఉత్సవాలు :**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఉత్సవ నిర్వహణ, నిమజ్జనం తదితర విషయాలకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీలతో అధికార యంత్రాంగం సమావేశాలు నిర్వహించింది.

**ఉత్సవాలకు వర్షం అడ్డంకి :**

ఈ ఏడాది చవితి ఉత్సవాలపై వర్ష ప్రభావ సూచన కనిపిస్తుంది. మంగళవారం మొత్తం ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. వాతావరణ శాఖ రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటన చేయడంతో గణపతి పూజా కార్యక్రమాలపై వర్షం ప్రభావం ఉండే అవకాశం ఉంది.

**విరివిగా పూజా సామాగ్రి అమ్మకాలు :**

వినాయక పూజా కార్యక్రమాలకు సంబంధించి పత్రి ఇతర పూజా సామాగ్రిని అమ్ముకునే దుకాణాలు విరివిగా వెలిశాయి. ముఖ్యంగా పత్రి, కూరగాయలు, జిల్లేడు, జమ్మి, ఉమ్మెత మొదలైనవి రోడ్లపై పెట్టి విరివిగా విక్రయిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులేద్దాం

**(మొదటిపేజీ తరువాయి)**

కార్పోరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. హానికరమైన రసాయన, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలు వాడటం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని, తద్వారా పలు రకాల ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ప్రభుత్వం పలు స్వచ్ఛంద సంస్థల చొరవతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, మరింత ప్రచారం కల్పించడం ద్వారా మట్టి విగ్రహాలు ఏర్పాటును విస్తృతం చేయాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. ఇందులో భాగంగా సుమారు 3వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గణేష్ మండపాల వద్ద పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పండుగ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కార్పోరేషన్ కమిషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రాచారి, రంగ ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఎస్‌కే ఫహీం, గెద్దాడు నగేష్, కేశవరావు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, దుర్గ, సతీష్, నర్సింహా, అజీజ్, నీడల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉపాధి అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మహిళలు నైపుణ్యంతో లాభసాటి వ్యాపారాలను ప్రారంభించాలని తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, మహిళా ప్రాంగణాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. మహిళ ప్రాంగణ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రాంగణానికి కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి మహిళా ప్రాంగణ మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, టీచింగ్ రూమ్స్, వసతి గృహం, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతుల ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు, స్వయం ఉపాధికి అందిస్తున్న డ్రోన్ శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే నేపథ్యంలో మన తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదిగి దేశాభివృద్ధికి మనం తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల వర్క్ ఫోర్స్ పెరగడం చాలా కీలకమన్నారు. ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వామ్యం చేయడం వల్ల ప్రగతి చాలా రెట్లు పెరుగుతుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా శిక్షణ తీసుకుంటున్న మహిళలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. డ్రోన్ వాడకంపై కూడా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగం ఖమ్మం జిల్లా ఆర్థిక వ్యవస్థకు కీలకమన్నారు. ఆరు లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని సంవత్సరానికి పది



లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం రైతులకు కూలీలు దొరకడం లేదని వ్యవసాయ రంగం యాంత్రీకరణ వైపు వెళ్తుందని డ్రోన్ వినియోగిస్తే ఒక ఎకరం భూమిలో పురుగుమందు పిచికారి 15 నిమిషాల్లో చల్లవచ్చున్నారు. డ్రోన్ వాడకం వల్ల రోజుకు దాదాపు రూ. 15వేల వరకు సంపాదించవచ్చునని, నెలలో 20 రోజులు పని చేస్తే కలెక్టర్ కంటే ఎక్కువగా సంపాదించవచ్చునని తెలిపారు. నానో యూరియా వాడకం డ్రోన్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో డ్రోన్ వినియోగం పెరుగుతుందని తెలిపారు. వ్యాపార రంగంలో లాభార్జనే ధ్యేయంగా ముందుకెళ్లాలని కష్టమర్లలో నమ్మకం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణ మేనేజర్ వేల్పుల విజేత, సిబ్బంది సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, మౌనిక, లాలయ్య, జయ, శారద, అనిత, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# బొలెరో, లారీ ఢీ

**- ఒకరికి తీవ్ర గాయాలు**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:** ఎదురెదురుగా వస్తున్న బొలెరో, ట్రాలీ లారీ ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం నుండి కొత్త ద్విచక్రవాహనాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని వరంగల్ నుండి ఖమ్మం వైపు వెళ్తున్న గ్రానైట్ రాళ్లను తరలించే ట్రాలీ లారీ ఎదురెదురుగా ఢీకొనగా వాహనాలు నుజ్జునుజ్జు కాగా బొలెరో వాహనం డ్రైవర్ వినయ్‌కు స్వల్ప గాయాలుకాగా ట్రాలీ లారీ పక్కన ఉన్న వేప చెట్టుకు ఢీకొనగా



లారీ డ్రైవర్ ఉప్పలతల నాగేశ్వరరావు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బోనస్ కోసం రైతన్నల ఎదురుచూపు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్ కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో 70వేల క్వింటాళ్లకు సంబంధించి రూ. 3.50 కోట్ల బోనస్ రావాల్సి ఉంది. అధికారుల చుట్టు రైతులు కాళ్ల అరిగేలా తిరుగుతున్నారు. కేవలం రూ.76 లక్షల బోనస్ మాత్రమే చెల్లించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం క్వింటా రూ. 2,300 కొనుగోలు చేయడంతో పాటు సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. జల్లేపల్లి, ఎదుళ్లచెరువు, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, బీరోలు, జూపెడ, బచ్చోడు, మేడిదపల్లి, తాళ్లచెరువు, దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సహకార సంఘం, ఐకెపిలు ధాన్యాన్ని కొనుగోలు చేశాయి. అప్పట్లోనే కాంటాలు, ఎగుమతి, దిగుమతి సమయంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా బోనస్ ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టుబడుల సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే బోనస్ చెల్లించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఎనిమిది మంది మావోయిస్టులు లొంగుబాటు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది దళసభ్యులు మంగళవారం ఎస్‌పి రోహిత్ రాజ్ ముందు లొంగిపోయారు. ఈ మేరకు ఎస్‌పి వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసులు కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని నక్సలిజాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలిసేందుకు ఎనిమిది మంది లొంగిపోయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 314 మంది లొంగిపోయారని, వారికి ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పించామన్నారు. ప్రస్తుతం భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుండి ఐదుగురు సభ్యులు మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారని, దళంలో ఉన్న వారు మావోయిస్టు పార్టీని వీడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు ముందుకు రావాలన్నారు. లొంగిపోయిన 8 మంది మావోయిస్టు దళ సభ్యులకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున మొత్తం రూ.2 లక్షలు ఇచ్చారు. తుదుపరి వారి ర్యాంకుల ఆధారంగా మిగతా నగదు, ఆధార్ కార్డులు, బ్యాంకుఖాతాలు ఇచ్చిన తర్వాత బ్యాంకులో జమ చేస్తామని చెప్పారు.

# మట్టి గణపతిని పూజించండి




**ప్రజాపక్షం/వైరా:** శ్రీమొల్లం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పూజించండి అనే ప్రచార పత్రాలను వైరా సిఐ సాగర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మట్టి గణపతి విశిష్టతలని తెలియజేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా మొల్లమాంబ కుమ్మర సంఘం నాయకులు గుమ్మడిదల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వర్లు, గుడిమెట్ల రవి, విలాసాగరం నరేష్, దరిపల్లి మధు, మల్లికార్జున్, వెలిశాల కరీం, వేణు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మలకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/బోనకల్:** బోనకల్ గ్రామానికి చెందిన బాలు నిర్మల ఇటీవల ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు విభాగంలో బోయ జంగయ్య అనే కథలో మానవత దృక్పథం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గానూ డాక్టరేట్ పొందారు. పేద కుటుంబంలో పుట్టిన ఆమె పిహెచ్‌డి సాధించటం పట్ల ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధువులు, కుటుంబీకులు శాలువ కప్పి, సిఐ మధు, ఎస్ఐ వెంకన్న చేతుల మీదుగా సన్మానం చేశారు. నిర్మలను సన్మానించిన



వారిలో సంగాపు దుర్గాప్రసాద్, చిట్టంశెట్టి రాము, సంగాపు శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, టిఆర్ఎస్ నాయకులు చల్లి ప్రసాదరావు, సిపిఐ నాయకులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

# ఇండ్ల స్థలాల తీర్పుపై పునరాలోచన చేయాలి



**-పోరాటలతోనే సమస్యకు పరిష్కారం**
**-టియుడబ్ల్యూజె (ఐజెయు)**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం అనేక దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని అత్యున్నత న్యాయస్థానం జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి తీర్పుపై పునరాలోచన చేయాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ విజ్ఞప్తి చేశారు. బ్యూరోక్రసి చట్టసభల ప్రతినిధులతో జర్నలిస్టులను పోల్చడం సరి కాదని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం నగర కమిటీ సమావేశం మంగళవారం స్థానిక జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. యూనియన్ నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో రాంనారాయణ మాట్లాడుతూ మీడియా రంగంలో వచ్చిన మార్పులు కొన్నింటిని ఆహ్వానిస్తూనే జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, కనీస వేతన అమలు తదితర విషయాలపై యూనియన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టక తప్పదన్నారు. నివాస స్థలాల పట్ల పాలకులు సరైన రీతిలో స్పందించడం లేదని పంపిణీ చేసే అవకాశం ఉన్న చోట కూడా కొందరు ప్రజాప్రతినిధులు మొకాలు అడ్డుతున్నారని ఆయన ఆరోపించారు. నివాస స్థలాల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆయన జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. విద్య, వైద్యానికి సంబంధించి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని హెల్త్ కార్డులు పనిచేయక జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు నగదు రహిత వైద్యం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తుందన్నారు. నిరంతరం జర్నలిస్టుల సమస్యలపై స్పందించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని ఐక్య పోరాటాలకు టియుడబ్ల్యూజె (ఐజెయు) పిలుపునిస్తుందన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర సమితి సభ్యులు సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఎల్రక్టానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాలరావు, మహేందర్, స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర కార్యదర్శి ఎన్. జనార్ధనాచారి, కోశాధికారి ఏలూరి వేణుగోపాల్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు నామ పురుషోత్తం, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న జరిగే ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న, జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిఆర్‌టియు నాయకులు అన్నారు. పాల్వంచ పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నరసయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత సభ్యత్వాలు, వాటి వలన కలిగే ప్రయోజనాలపై సమీక్షించారు. అధిక సంఖ్యలో సభ్యత్వాలను చేర్పించిన జిల్లా, మండల నాయకులను అభినందించారు. మృతి చెందిన ఇద్దరు ఉపాధ్యాయ కుటుంబాలకు యూనియన్ ద్వారా చెరో లక్షరూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పిఆర్‌టియు సభ్యత్వం తీసుకున్న వారికి యూనియన్ తరుపున ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. ధర్నా విజయవంతం చేయటానికి ప్రతీ ఒక్కరు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు భాస్కరరావు, రవీందర్, కళావతి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండోర్ విధానాలు ఖమ్మంలో అమలు




**-స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి**
**-మేయర్ పునుకొల్లు నీరజ**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇండోర్ నగరంలో అమలవుతున్న విధానాలను ఖమ్మం నగరంలో అమలు పరిచి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా తో కలిసి ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ఇండోర్ స్టడీ టూర్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇండోర్ నగర స్టడీ టూర్‌లో ఎన్నో అనుభవాలను గుర్తించామన్నారు. ఇండోర్ నగరం వరుసగా దేశంలోనే శుభ్రమైన నగరంగా అవార్డు పొందుతుందన్నారు. దానికి కారణం అక్కడ పారిశుధ్య నిర్వహణ, శుభ్రత పట్ల ప్రజలకు అవగాహన, ఆధునీక సాంకేతిక వినియోగిస్తున్నారన్నారు. ఇండోర్ నగరంలో వ్యర్థాలను వేరు చేయడం, ప్రతి ఇంటి నుంచి ఖచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాలను వనరులుగా మార్చుతున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి శుభ్రతను ఒక ఉద్యమంగా తీర్చిదిద్దడంతో పాటు గ్రీన్ ఎనర్జీ వినియోగం, సాంకేతిక పద్ధతులను ఉపయోగించడం, వెహికిల్ ట్రాకింగ్ కంట్రోల్ రూము ఏర్పాటు వంటి విధానాలను అక్కడ అవలంభిస్తున్నారన్నారు. ఇండోర్ నగరంలో అవలంభిస్తున్న విధానాలు ఖమ్మం నగరానికి కూడా చాలా అవసరమన్నారు. ఇండోర్ నగరంలో అవలంభిస్తున్న విధానాలను ఖమ్మం నగరంలో కూడా అమలు చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్‌జీవోస్ కూడా ముందుకు వస్తే వారి భాగస్వామ్యంపై పారిశుధ్య నిర్వహణ, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. ప్రజల సహకారంతో ఇండోర్ తరహాలో ఖమ్మం నగరాన్ని స్మార్ట్‌సిటీగా నిలపడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మలీదు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**ప్రజాపక్షం/దమ్మపేట:** మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా మట్టి గణపతిని పూజించాలి అని ప్లాస్టర్ పారిస్ విగ్రహాలు సాధ్యం అయినంత వరకు నివారించాలని, మట్టి గణపతులను పూజిస్తే భక్తి ముక్తి శక్తి లభిస్తాయని తెలియజేశారు. పార్వతి దేవి అమ్మవారు శరీరం శుభ్రం చేసుకున్న నలుగు మట్టి నుండి వినాయకుడు ఉద్భవించాడని మన పురాణాలు చెబుతున్నాయని ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉన్నది లేకుంటా ప్రకృతి ప్రణయానికి ఎవరైనా శిరస్సు వంచాల్సిందే కావున ప్రతి ఒక్కరు కూడా మట్టి విగ్రహా కి పూజ చేసి స్వచ్ఛమైన పర్యావరణం రాబోయే తరాలకి అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తంబళ్ల రవి, షేక్ జాన్ బీ, పల్లపు వెంకటేశ్వర్లు, నాగరాజు, వరప్రసాద్, దొడ్డ సతీష్, దారా విజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలం

**డిఎంఅండ్‌హెచ్‌ఓ**
**కళావతిబాయి**






**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలమని డిఎంఅండ్‌హెచ్ఓ బి కళావతిబాయి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పిసిపిఎన్‌డిటి యాక్ట్ అడ్వైజరి కమిటీ సమావేశాన్ని డిఎంఅండ్‌హెచ్ఓ ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వైజరీ కమిటీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్ అంటే పుట్టిన బాలికలను రక్షించడం మాత్రమే కాదు ప్రతి గర్భిణీ స్త్రీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా ప్రసవం అయ్యేలా అన్ని జాగ్రత్తలు తీసుకుందామని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్ల స్వేచ్ఛగా పుట్టాలి, గౌరవంగా పెరగాలి, జ్ఞానంతో ఎదగాలి, ఆడపిల్లలేని సమాజం ఊహించలేమని, ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలకారకులని తెలిపారు. జిల్లాలో అందరం కలిసి పుట్టబోయే ఆడపిల్లల శాతం తగ్గకుండా సీరియస్‌గా మానిటరింగ్ చేయాలని, భ్రూణ హత్యలు, అబార్షన్లు, లింగ నిర్ధారణ చేస్తున్న వ్యక్తులు సంస్థలు, ఫెసిలిటిస్‌పై గట్టి నిఘా పెట్టాలని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించి అబార్షన్లు, భ్రూణ హత్యలు జరగకుండా కట్టడి చేద్దామని పేర్కొన్నారు. బాలికలు పుట్టడానికి ముందే వివక్షను ఎదుర్కొంటున్నారని, వారికి పుట్టే, జీవించే, పెరిగే హక్కులు అందరితో పాటు సమాన హక్కులున్నాయని, స్కానింగ్ సెంటర్లపై, అబార్షన్లు చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టం( ప్రొహిబిషన్ ఆఫ్ సెక్స్ సెలెక్షన్) చట్టాన్ని అతిక్రమిస్తే చట్టం ప్రకారమే సీజ్ చేస్తామని ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డా చందు నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, హెడ్‌ఆఫ్‌ది డిపార్మెంట్ పిడియాట్రిక్స్ డాక్టర్ బాబురత్నాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డిపిఆర్ఓ గౌస్, డిసిపిఓ విష్ణువర్ధన, డెమో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరక్టర్ కె శ్రీనివాసరావు, జాగ్రతి స్వచ్ఛంధ సేవా సంస్థ కుముదిని, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, డిఎంసి సయ్యద్ సమీనా, హెల్త్ సూపర్‌వైజరు నర్సయ్య, డిఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో యాప్ సోపాలు

**ముందుకు సాగని ముఖ గుర్తింపు ధృవీకరణ**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించేందుకు తప్పనిసరిగా ముఖ గుర్తింపు కావాలని ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో టి హెచ్ ఆర్ బాలామృతం తదితరాలను లబ్ధిదారులకు అందించేందుకు వినియోగిస్తున్న పోషన్ అభియాన్ యాప్ కు పారదర్శకత దిశగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు జోడించడంతో కష్టాలు ప్రారంభమయ్యాయని అంగన్‌వాడి ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ఆరు నెలలు దాటిన ఈ కార్యక్రమానికి శుభం కార్డు పడటం లేదని పేర్కొంటున్నారు. లబ్దిదారుల వివరాలు నమోదు చేసినప్పుడు అప్డేట్ కావడానికి ఒకటి రెండు రోజులు పడుతుందని వారు తెలుపుతున్నారు. యాప్ సమస్యలపై అనుసంధానం చేసి చేతులు దులుపుకున్నారే తప్ప సమస్యలపై స్పందించడం లేదని వారు వివరిస్తున్నారు. యాప్ లో ఆధార్ నమోదు చేసుకున్న వారు ఓటీపీలు పూర్తి వివరాలు చెప్పడానికి వారం పది రోజులు పడుతుందని వారు తెలుపుతున్నారు. మరికొందరు తల్లులు ఓటీపిలు చెప్పడానికి అనుమానిస్తున్నారని పేర్కొంటున్నారు. యాప్ కు అనుకూలంగా ఉన్న ఫోన్ సహకరించకపోవడంతో అదో ఇబ్బంది పడుతున్నామని వివరిస్తున్నారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో ఏసి డిపిఓల పర్యవేక్షణతో ఇబ్బందులను తొలగిస్తున్నామని, ఈ విషయమై సిడిపిఓ ను జ్యోతి నిర్మలను వివరణ కోరగా సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని అట్టి సమస్యలను అధిగమిస్తున్నామని తెలిపారు

# నేటి నుండి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

- ముస్తాబవుతున్న పందిళ్లు
- నిబంధనలు తప్పనిసరి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సర్వ విఘ్నాలను తొలగించే గణనాథున్ని పూజించేందుకు ప్రజలు, భక్తులు సిద్ధపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు గణేష్ విగ్రహాలను సిద్ధం చేసుకున్నారు. నవరాత్రుల పాటు స్వామివారిని జైజై గణేషా అంటూ పూజించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవ కమిటీలు మండపాలు సిద్ధం చేశారు. ఈ మండపాల్లో నవరాత్రుల పాటు స్వామి పూజలు అందుకోనున్నారు. పూజలో ఉపయోగించే పాలవెల్లి, పత్రి కోసం భక్తులు ఎగబడుతున్నారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రాల్లోని అన్ని మండలాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అదే విధంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు పాఠశాలల్లో మట్టితో తయారు చేసిన చిన్నచిన్న వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

### నవరాత్రుల కోలాహలం...

తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకునే గణపయ్య మండపాల్లో కోలాహల వాతావరణం నెలకోనుంది. భజనలు, పూజలు, ప్రత్యేక పూజలు భక్త కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. గతంలో వినాయక చవితి వచ్చిందంటే పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ పద్దతికి దాదాపుగా స్వస్తి పలికారు.

### రసాయ విగ్రహాల అమ్మకాలు...

పర్యావరణానికి హాని చేసే రసాయ విగ్రహాలను జిల్లాలో పలు చోట్ల విక్రయిస్తున్నారు. వాటిని నియంత్రించేందుకు ఎవ్వరూ ముందుకు



రావడం లేదు. ఉత్సవ కమిటీలు కూడా పోటీ పడి మరీ పెద్దపెద్ద విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు. పర్యావరణ హితం కోసం పాటుపడాల్సిన వారు అందుకు భిన్నంగా ప్రవర్తిస్తుండటంతో పలువురు నొచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా పలు చోట్ల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. మట్టి విగ్రహాల పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

### నిబంధనలు తప్పనిసరి...

వినాయక చవితి సందర్భంగా ఉత్సవ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు నిబంధనల ప్రకారం నడు చుకోవాలని సూచించారు.

* నిర్వాహకులు తప్పని సరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలి.
* ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పందిళ్లు ఉండాలి.
* ఉత్సవాల సందర్భంగా ఊరేగింపుల కోసం పోలీస్ అనుమతి తప్పనిసరి.
* మండల వద్ద లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టరాదు. రాత్రి 10 గం. నుండి ఉదయం 6 గం. వరకు మాత్రమే మైకులు వాడాలి.
* వినాయక మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
* ఊరేగింపు సమయంలో ఇతర మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదు. ఊరేగింపు సమయంలోనూ, మండపాల వద్ద ఎలాంటి బాణాసంచా కాల్చరాదు. ఊరేగింపు సమయంలో కర్రలు, ఆయుధాలు వాడరాదు.
* వినాయక మండపాల వద్ద అనుచిత ప్రదర్శనలు నిర్వహించ కూడదు.
* నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

# మట్టి గణపతులే మేలు

- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మట్టి గణపతులే మేలని, వినాశనకర రసాయన విగ్రహాలు వాడటం ద్వారా పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కాలుష్య నియత్రణ మండలి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ హితం అందరి బాధ్యతని, ఇదే భవితారల భవిష్యత్ కోసం చేయాల్సిన పెద్ద యుద్ధం అన్నారు. ప్రతీ ఒక్కరూ ప్ర కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆద్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచలలో సుమారు 2వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

# ప్రభుత్వాస్పత్రి వైద్యులపై ఎంఎల్‌ఏ ఆగ్రహం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులపై ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆస్పత్రి ప్రాంగణానికి ఆకస్మికంగా చేరుకున్న ఆయన ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వైద్యులను పలిచి ఇదేమి పరిశుభ్రతా అంటూ మండిపడ్డారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పలు సార్లు చెప్పామని, పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేక ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి పద్దతుల్లో ఉండటం మంచిది కాదన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పలు సార్లు తన దృష్టికి వచ్చిందని, పద్దతి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. సిబ్బంది పనితీరు, పద్దతుల వద్ద చెడ్డపేరు వస్తుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. చిన్న చిన్న కేసులను కూడా వేరే ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులను వేరే ప్రదేశాలకు రిఫర్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఇక్కడి సిబ్బంది రోగులకు పరిశీలించి పరీక్షించాలి కదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు చేస్తున్నామంటే దానిలో నిబంధత ఉండాలని, మొక్కుబడి ఉద్యోగాలు చేసే వారు ప్రజల మన్ననలు పొందడం కష్టం అన్నారు. ఇకనైనా పద్దతి మార్చుకుంటే మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ వెంటే సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎకెసే సాబీర్ పాషాతో పటు పలువురున్నారు.

# పత్తాలేని ప్రత్యేక అధికారులు..?

-గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
-కనిపించని పాగింగ్
-రోగాల బారిన పడుతున్న ప్రజలు




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ఒక ప్రత్యేక అధికారిని కేటాయించి బాధ్యతలు అప్పగించింది. అయితే ప్రత్యేక అధికారులు ఎక్కడ గ్రామపంచాయతీలో పర్యటించిన సందర్భాలు లేవనే చెప్పవచ్చును. పేరుకే ప్రత్యేక అధికారులు తప్ప కేరాఫ్ ఎక్కడో తెలియని పరిస్థితి. గ్రామాల్లో దయనీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కడబడితే అక్కడ పారిశుద్ధ్య తాండవిస్తుంది. నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. కాని నెలలు గడుస్తున్న ప్రత్యేక అధికారులు అటువైపు కనుచూపు మేరకు కూడా కనిపించడం లేదనేది గ్రామ ప్రజల వాదన. అసలు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం దేనికి కేటాయించింది. స్థానిక సంస్థల ఎన్నికలు అయిపోయిన సర్పంచ్ పదవీకాలం అయిపోయిన తర్వాత పరిపాలనకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ప్రత్యేక అధికారులను కేటాయించడం జరిగింది. కాని ఇప్పుడు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ఎక్కడ ఏ ప్రత్యేక అధికారి పనిచేయడం లేదు. అధికారులకు పూర్తిగా గ్రామపంచాయతీలపై పట్టులేదని చెప్పవచ్చును. ఎందుకు అంటే ప్రతి గామంలో డ్రైనేజీల్లో నీటి నిల్వతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్యం ఎక్కడబడితే అక్కడ తాండవిస్తుంది. అసలే వర్షాలు కురుస్తున్నాయి. జ్వరాల బారిన పాడిన ప్రజలు పడుతున్నారు. పంచాయతీల్లో ఎక్కడ పాగింగ్ చేసిన సందర్భం కనిపించడం లేదు. బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. దీనికి బాధ్యత ఎవరిది. ప్రత్యేక అధికారులదా, పంచాయతీ సెక్రటరీలదా, ఒక్కసారి జిల్లా అధికార యంత్రం ఆలోచించాలి. వైరా మండలంలో ఇప్పటికే జ్వరాలు విపరీతంగా వైరా మండలంలో ఇప్పటికే జ్వరాలు విపరీతంగా నమోదు అవుతున్నాయి. అధికార యంత్రాంగం అప్రమత్తం కాకపోతే ప్రజలు మరింత జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. అసలు ప్రత్యేక అధికారులు పాలనపై ఎందుకు దృష్టి సారించడం లేదు. ఒక్కసారి జిల్లా కలెక్టర్ వైరా మండలంలోని ప్రత్యేక అధికారుల పరిపాలనపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రామాలయం ఇఓగా దామోదర్ రావు

- ప్రస్తుత ఇఓ రమాదేవి బదిలీ




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా కె దామోదర్ రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దామోదర్ రావు గత నెల వరకు భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎల్ రమాదేవిని బదిలీ చేశారు. ఆమె 2023 ఫిబ్రవరిలో రామాలయం ఇఓగా విధుల్లో చేరారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆమె ఆలయంలో పలు సంస్కరణకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయ పరిపాలన గాడిలో పడటమే కాకుండా ఆదాయం కూడా గననీయంగా పెరిగింది. మరో ప్రక్క రామాలయ భూములను కాపాడేందుకు ఆమె చూసిన చొరవ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

# పారిశుద్ధంపై దృష్టి సారించండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామాలలో పారిశుద్ధం పై దృష్టి సారించాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధికారులను కోరారు. మండలం లోని చెరువు మాధారం లో మంగళవారం పారిశుద్ధంను పరిశీలించారు. అధ్వానంగా ఉన్నా డ్రైయినేజీలను, పేరుకపోయిన చెత్తచెదారం ను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుధ్యం లోపించటం వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. ఏ వీధి చూసిన ఏముంది గర్వకారణం అన్నట్లు గా వీధులన్ని కంపు కొడుతున్నాయని అన్నారు. గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంచార్జ్ గెల్లా నాగసాయి, మండల ప్రదాన కార్యదర్శి మలెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యాక్షుడు కొండా హర్షవర్ధన్, అల్లి భూలక్ష్మి, పురాణం దివాకర్, కళ్యాణం నాగేశ్వరరావు, కందరబోయిన వెంకటరమణ, లక్ష్మినారాయణ, బానోత్ శ్రీను, గెల్లా మధు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండలం లోని కొత్తకొత్తూరు లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో అమరవీరులైయ్యారని అన్నారు. వారి జ్ఞాపకాలుగా 100 ఎకరాలలో స్మృతి వనం ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇంటిని మం జూరు చేయాలని కోరారు. ఉద్యమకారులకు పెన్షన్. ఆరోగ్య కార్డులు, బస్ *పాసులు అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు గానే హామీలు అమలు చేయాలని కోరారు. రాహుల్, ఖర్గే, సీఎం, మంత్రులను కలిసి తమ న్యాయమైన డిమాండ్ల ను అసెంబ్లీలో ప్రకటించాలని కోరారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దశల వారీ పోరాటాలు చేసేందుకు జేఏసీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో కమిటిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తులాజారెడ్డి, ఉపాధ్యాక్షుడు బీ. మోహన్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, తీగ రాములు, వడ్డె జగన్, కృష్ణమూర్తి,వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ పిఓను కలిసిన గ్రంథాలయ చైర్మన్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం ఐటిడిఓ పిఓను జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసువులేటి వీరబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రంథాలయ తీరును చర్చించిన ఆయన దుమ్ముగూడెం మండలంలోనూతన గ్రంథాలయ స్థలం, భవన నిర్మాణం సహకరించాలని పిఓను కోరారు. దీనిపై స్పందించిన పిఓ స్థల సేకరణకు కృషి చేస్తామని, ఏజెన్సీ ప్రాంతాల్లో గల గ్రంథాలయలకు పుస్తకాలను సైతం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రంథాలయ అభివృద్ధికి ఐటిడిఏ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనంతరం చైర్మన్ పిఓకు షాలువా కప్పి సత్కరించారు.

## 28న అన్ని మండల కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** యూరియా కొరత లేకుండా చూడాలని, కేంద్రం నుండి వెంటనే రాష్ట్రానికి పంపించాల్సిననటువంటి యూరి యా కొరత పంపించాలని, ఇప్పటికి రాష్ట్రంలో యూరియా కొరతతో ఇబ్బందిగా మారిందని, దీనిని నిరసిస్తూ సిపిఐ రైతు సంఘం నాయకులు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 28వ తేదీన పినపాక నియోజకవర్గంలో అన్ని తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని, తహశీల్దార్‌లకు వినతి పత్రాలు అందించాలని పిలుపునిచ్చారు.

## మట్టి విగ్రహాలే మేలు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఎక్సలెంట్ హై స్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వయంగా ఎకో ఫ్రెండ్లీ గణేశ విగ్రహాలు తయారు చేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా మట్టి విగ్రహాలు వాడితే పర్యావరణానికి హాని కలగదని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటి కాలుష్యం కలిగిస్తాయని తెలుసుకున్నారు. చిన్న వయసులోనే పర్యావరణాన్ని కాపాడే అలవాటు పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. యూసుఫ్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా "ఎకో ఫ్రెండ్లీ గణేశ గ్రీన్ ఫెస్టివల్" అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

**ప్రజాపక్షం/దమ్మపేట:** చంద్రుగొండ మండలంలో బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పై విమర్శలకు దమ్మపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నశెట్టి యుగంధర్ మీడియా సాక్షిగా కౌంటర్ ఇచ్చారు. యుగంధర్ మాట్లాడుతూ బిజెపి జిల్లా అధ్యక్షుడు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. మరోసారి అవినీతి అంటూ ఎమ్మెల్యేపై నిందలు వేస్తే సహించేది లేదన్నారు.

## ప్రతిష్ఠాపనకు తరలిన వినాయకుని విగ్రహాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న వినాయక ఉత్సవ కమిటీల వారు ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాలను వాహనాలలో తరలించారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో తడవకుండా మండపాలను ప్రత్యేక పూజలను జరుపుకునేందుకు ఆకర్షణగా విద్యుత్ దీపాలతో అలంకరించి ఏర్పాటు చేసుకున్నారు. వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా గొప్పగా జరుపుకునేందుకు భక్తులు విరాళాలతో ఏర్పాటు చేసుకున్నారు. ఇదే అదునుగా ఒక్కో విగ్రహం రూ.15 వేల నుంచి 50 వేల వరకు ధర పలికింది. తయారీదారులు ధర పెంచేశారు. ఇతర మండలాల నుంచి వచ్చి ఎంతకైనా కొనుగోలు చేసుకుని తీసుకొనివెళ్లారు. అదేవిధంగా కల్లూరు లోని వినాయకుని పూజలకు ఉపయోగపడే పత్రాలకు కూడా వంద నుంచి రూ. 200 వరకు ధరలు పెంచి సొమ్ము చేసుకున్నారు. ప్రధానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా వ్యాపారాలు కొనసాగాయి. భక్తులు అమ్మకాల వద్ద కిక్కిరిసి కొనుగోలు చేసుకుని వెళ్లారు. ప్రధానంగా చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, కల్లూరు, బత్తులపల్లి, పేరువంచ, ముచ్చవరం, మండల పరిధిలోని పలు గ్రామాలలో వీధివీధిన ప్రధాన వీధులలో కూడలి ప్రాంతాలలో మండపాలలో స్థాపించి పూజలకు సిద్ధమయ్యారు.

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



**ప్రజాపక్షం/ మధిర :** సేవామూర్తి భారతరత్న, నోబెల్ అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మధిర ఆర్‌సిఎం చర్చి వెనుకాల ఉన్న మదర్ థెరిసా సేవాసదనంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావు తదితరులు సేవాసదనంలోని మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవామూర్తి మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవభావాన్ని కలిగి ఉండి ఎదుటి వారికి తమకు తోచిన విధంగా సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, యడపల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శి వాసు, సభ్యులు వాసు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల అగచాట్లు..!


**-పోలీస్ పహారా నడుమ యూరియా కట్టల పంపిణీ**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు యూరియా అందక అధిక ధర ఉన్న కాంప్లెక్స్ ఎరువులైన డిఏపి 20.20 పొటాష్, 14.35.28.28, 15.15.15 తదితర ఎరువులపై ఆధారపడి ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ఎరువులు కొనుగోలు చేసి పంటలకు వాడే పరిస్థితి నెలకొనడంతో రైతులు అధిక పెట్టుబడితో అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం సకాలంలో యూరియా అందించటంలో పూర్తిగా విఫలం కావడంతో తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలో ఎక్కువ శాతం పత్తి, మిర్చి, వరి పంటలు సాగు చేసి సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం సొసైటీల ద్వారా అందించే యూరియా కట్టలు అరకొర మాత్రమే అందించారు. పంట సాగు చేసిన మొదటి నుండి ఏడాది పొడవుగా ఒక ఎకరాకు ఐదు కట్టలు యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని ఒక్క రైతుకు ఒక్క యూరియా కట్టను అందిస్తున్నారు. పోలీస్ పహారా మధ్య క్యూలైన్‌లో బారులు తీరిన రైతులు యూరియా కోసం గంటల వ్యవధి సమయం వేచి చూడాల్సి వస్తుంది. ఒక్కొక్క రైతు పత్తి, మిర్చి, వరి పంటలను ఐదు నుంచి పదిహేను ఎకరాల వరకు సాగు చేస్తుండగా ఒక్క యూరియా కట్ట ఇచ్చి పంపిస్తే ఆ యూరియాని ఏం చేయాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎక్కువ డబ్బు పెట్టి ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద కొనుగోలు చేద్దామన్న అక్కడ కూడా యూరియా లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బీరోలు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లేపల్లి సొసైటీలో యూరియా కట్టలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల్లేపల్లి సొసైటీలో 225 కట్టలు గోడౌన్‌కి రాగా సుమారు 600మంది రైతులు కట్టల కోసం సొసైటీ గోడౌన్ వద్ద పడిగాపులు కాసి ఉండగా క్యూలైన్‌లో ఉన్న రైతులు ఒక్కొక్క కట్ట ఇంచి పంపించగా చాలా మంది రైతులు యూరియా కట్టలు అందకపోవడంతో సొసైటీ నిర్వాహకులపై రైతులు ఆందోళనకు దిగారు. వ్యవసాయ అధికారులు మళ్లీ స్టాక్ వచ్చిన తర్వాత యూరియా కట్టలు అందిస్తామని తెలిపి ఆందోళనను సద్దుమణిగించి రైతులను అక్కడి నుంచి పంపించి వేశారు. ప్రస్తుత సమయంలో పంటలకు యూరియా చాలా ముఖ్యమని, ఈ సమయంలో పాలక ప్రభుత్వాలు యూరియా అందించటంలో పూర్తిగా వైఫల్యం చెందాయని, సకాలంలో పంటలు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో సరిపడా యూరియాని అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఫైరవీల వైపు.. చెరువు కబ్జాదారుల చూపు..!

**- రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలతో ఎట్టకేలకు ఏదులాపురం ఈదుల చెరువు చెర వీడబోతోంది. ఈ పరిణామంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇది కబ్జా కోరులకు మాత్రం మింగుడు పడని అంశంగా మారింది. ఈ నేపథ్యంలో చెరువు ఆక్రమణలో ఉన్న భూములను రక్షించుకునే పనిలోపడ్డారు. ఇందుకోసం రాజకీయ నాయకులు ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటువంటి వాటిలో సిద్ధహస్తులైన రాజకీయ బ్రోకర్ల ద్వారా యత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు మార్చే రాజకీయ కుట్రకు తెరలేపారు. ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమచారం.

**నీటి స్టోరేజ్‌కి ఆటంకగా కబ్జాలు..**

ఏదులాపురం ఈదుల చెరువు విస్తీర్ణం 97ఎకరాల వరకు ఉంటుంది. దీని కింద 350ఎకరాల వరకు ఆయకట్టు ఉండేది. అంతేకాకుండా 35గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి అందిస్తుంది. అటువంటి చెరువును కబ్జాదారులు యథేచ్ఛగా మట్టి మాటున ఆక్రమించారు. ఎంతో విశాలంగా ఉండే చెరువును వై ఆకారం కనింపించేలా?మింగేశారు. ఈ నేపథ్యంలో చెరువులో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాధార, ఎన్‌ఎస్‌పి ద్వారా వచ్చే నీళ్లు చెరువులో స్టాక్ అవడం లేదు. చెరువు ఇరువైపులా భూములు కబ్జా కావడంతో



నీరు తూముల ద్వారా బైటికి వెళ్లిపోతుంది. చెరువు నుండి మత్తడి దూకాల్సిందిపోయి చెరువు ఆక్రమనకు గురై నీరు నివాసాల్లోకి వస్తున్నాయి. ఈ పిరిస్థితితోనే ఏదులాపురం ఎస్‌సీ కాలనీ సైతం మునకకు గురవుతోంది. ఈ తీరుతో నీటి స్టోరేజ్‌కి కబ్జాలు ఆటంకంగా మారాయి.

**30 ఎకరాలు కబ్జా...**

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించిన అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డిజిఎస్) సర్వే పూర్తయింది రెవెన్యూ, ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో చెరువు శిఖంతో పాటు బఫర్‌జోన్ ఆక్రమణలోనే ఉంది. డీజీపీఎస్ సర్వే ద్వారా చేపట్టిన కోఆర్డినేటర్ ఆక్రమిత భూముల్లోనే చూపించాయి. ఇవి కనీసం 30ఎకరాల వరకు ఉండే అవకాశం ఉందని,అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన మ్యాపింగ్ సైతం అధికారులు చేపట్టారు. అలాంటి తరుణంలో కబ్జా కోరులు చేస్తున్న విఫలాయత్నాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఊరుకు జీవనాధారమైన చెరువుపై ఓ పక్క భూ ఆక్రమణదారులు, మరోపక్క రాజకీయ బ్రోకర్లు పన్నగం ప్రజాక్షేత్రంలో బట్టబైలు అయ్యింది.

# సీతారామ.. ఈ వంతెన దాటేదెలా...!





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని సీతారామ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాలువపై నిర్మించిన కాంక్రీట్ బ్రిడ్జి బురదమయంగా మారింది. మండల ప్రధాన కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి మర్రిగూడెం గ్రామ సమీపంలో ఈ సీతారామ ప్రాజెక్ట్ కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు 62లక్షల రూపాయలను ఖర్చు చేశారు. ఇంత ఖర్చుపెట్టినప్పటికీ బ్రిడ్జి కింది భాగంలో నీటి ప్రవాహానికి తట్టుకునే అంత నాణ్యమైన కాంక్రీట్ లేకపోవడం వలన గ్రౌండ్ లెవెల్ కాంక్రీట్ చాలా వరకు కొట్టుకుపోయింది. ఇదిలా ఉండగా ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు బ్రిడ్జిపై నుండి పోయే మార్గాలు లేక బ్రిడ్జి మొత్తం బురదతో నిండిపోయింది. ప్రతి రోజు ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు, చూసిచూడనట్లు ఈ బురదలో నుండి ప్రయాణించడం గమనార్హం. ప్రజలు మాత్రం సీతారామ ఈ బ్రిడ్జిని దాటేది ఎలా అంటూ బెంబేలుఎత్తుతున్నారు. కనీసం కాలినడకన పోవాలన్న జిగటమన్నుతో బురద మయంగామారిపోయింది. ద్విచక్ర వాహనాదారులు జారిపడుతున్నారు. కొత్తగా ఈ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులకు ప్రమాదాలు తప్పని సరి అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత సీతారామ ఇరిగేషన్ కాల్వకు సంబంధించిన అధికారులు స్పందించి ఈ బ్రిడ్జిపై పేరుకుపోయిన బురదను తొలగించి ప్రయాణికుకలు సులభతరమైన ప్రయాణాన్ని అందించేలాగా చర్యలు చేట్టాలని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వామ్మో పిచ్చి కుక్కలు..!

**-రోజురోజుకు పెరుగుతున్న కుక్కల దాడులు**
**-పట్టించుకొని సంబంధిత అధికారులు**





**ప్రజాపక్షం/పినపాక:** మండలంలో పిచ్చికుక్కలు హడలెత్తిస్తున్నాయి. గ్రామాలలో గుంపులుగా తిరుగుతున్నా శునకాలతో ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు. చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా దాడులు చేస్తుండడంతో వీధుల్లోకి రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. ప్రధానంగా రాత్రి వేళ ప్రధానరోడ్ల వెంబడి, కాలనీల్లో రహదారుల మధ్యలో బైఠాయిస్తున్న కుక్కలతో ఆ మార్గంగుండా వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల వెంట పరుగులు తీస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుండగా కుక్కలదాడిలో ఒకవైపు మనుషులు, మరోవైపు పశువులు గాయపడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వివరాల్లోకెళితే.. పినపాక మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో సోమవారం సాయంత్రం సమయంలో ఏడాది వయస్సు ఉన్న బాబు ఈశ్వన్విక్ తమ ఇంటి బయట ఆవరణంలో ఆడుకుంటుండగా ఓ పిచ్చికుక్క విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిందని తండ్రి సొందపు సంతోష్, తల్లి వెన్నెల తెలిపారు. వెంటనే మెరుగైన వైద్య సేవలు కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శునకాల దాడిలో నిత్యం పదుల సంఖ్యలో ఆసుపత్రులకు వస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కుక్కల భయంతో రహదారులపై తిరిగేందుకు ప్రజలు జంకుతుండగా, పిల్లలను పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు తిరిగి వచ్చే వరకు ఆందోళనగా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. శునకాల దాడిలో కొందరికి తీవ్ర గాయాలు అవుతుండగా నయం కావడానికి నెలల సమయం పడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా సరైన వైద్యమందక పలువురు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో యాంటీరేబిస్ వ్యాక్సిన్ వినియోగం పెరిగిపోతుంది. దీంతో తక్కువ గాయాలైన వారికి నిర్ణీత గడువు ప్రకారం వ్యాక్సిన్ డోస్ వేస్తున్నారు. తీవ్రంగా గాయపడితే ప్రభుత్వ పరంగా సరైన చికిత్స అందక కొందరు ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఇంత జరుగుతున్న కుక్కల సంతతిని తగ్గించేందుకు కానీ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసిన దాఖలాలు లేకపోగా వాటిని పట్టుకొని తరలించే నాథుడే కరువయ్యాడు.

**ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..**

రోజురోజుకు పెరుగుతున్న కుక్కల బెడదతోజంకుతున్నారు. ఏ వీధికి వెళ్లిన పదుల సంఖ్యలో కుక్కలు నడిరోడ్డుపై బైఠాయిస్తూ వచ్చిపోయే వారిపై దాడులు చేస్తున్నాయి. ఒకేసారి నాలుగైదుకుక్కలు దాడిచేయడంతో పెద్దవారు సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంటుందని బాధితులు వాపోతున్నారు. కుక్క కాటు వేసిన తర్వాత కొన్నివారాల పాటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇంజక్షన్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్నిచోట్ల కుక్క కాటు వల్ల ర్యాబిస్ వ్యాధి సోకి మృతి చెందిన దాఖలాలు లేకపోలేదు. ఇంత జరుగుతున్నప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టులు కుక్కల సంతతిని తగ్గించాలని, జనావాసాల్లో కుక్కలబెడదను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకొని కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# నానో యూరియా, డీఏపీలను వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** పంట పొలాలకు ఎరువుల వినియోగాన్ని దశల వారీగా తగ్గించేందుకు ప్రభుత్వం కొత్త సంస్కరణలు చేపట్టింది. సారవంతమైన భూముల స్వభావం దెబ్బతినకుండా ఉండేందుకు, కాలుష్యం లేకుండా మార్పులు చేపడుతోంది. అందులో భాగంగా చిన్నచిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో లిక్విడ్ నానో యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగంతో సాగు ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడికి దోహదపడుతుంది. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లాలోని 23 మండలాల్లో సాగు విస్తీర్ణం 6,03,124 ఎకరాలు. ఉద్యాన తోటలు మినహా ఈ ఖరీఫ్ లో 4,72,559 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా. వరి 1,65,956 ఎకరాలు, పత్తి 2,04,632 ఎకరాలు మొక్కజొన్న 86,544 ఎకరాలు, మిరప 10,489 ఎకరాలు, వేరుశనగ 2,791 ఎకరాలు, కందులు 1,159 ఎకరాలు, మినుములు 857, పెసలు 131 ఎకరాల్లో సాగు చేయనున్నారు. రైతులు ఎరువుల వినియోగానికి, కూలీలకు అధిక మొత్తంలో పెట్టుబడులు వెచ్చిస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం నానో యూరియా, డీఏపీని లిక్విడ్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండేళ్ల ముందు మార్కెట్లోకి విడుదల చేయగా జిల్లాలో రైతులు పది శాతం కూడా వినియోగించడం లేదని అధికారుల ద్వారా తెలుస్తోంది. సాధారణంగా ఎకరం పంటకు 2 నుంచి 3 బస్తాల యూరియాను ఉపయోగిస్తున్నారు. ఒక బస్తా కేవలం 35 శాతం పంటకు మాత్రమే వస్తుంది.అదే నానో యూరియా అర లీటరుతో ఎకరం పంట సాగు చేసుకోవచ్చని, 80శాతం పంటకు అందుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు

**రైతులందరూ వినియోగించాలి..**

ఏడీఏలిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియా, డీఏపీలను రైతులందరూ వినియోగించు కోవాలని పినపాక వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి. తాతారావు తెలిపారు. వీటి వాడకంతో రైతుకు ఖర్చు తక్కువ ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని రెవులు పొగు దిగుబడి పెంచుకోవచ్చని పేర్కొన్నారు.

# పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం

**పట్టించుకోని కార్యదర్శి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఉల్వనూరు పంచాయితీలో పారిశుధ్య పనులు నిర్వహించకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి కాలువలలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు ఆవాసాలుగా మారాయి. దీనితో పలువురు వైరల్ , మలేరియా లాంటి జ్వరాల భారిన పడుతున్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయించాలని పంచాయితీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా తీవ్ర నిర్లక్ష్యంతో ఉంటూ ఎంతమాత్రం పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంగళవారం పానుగంటి లక్ష్మణ్ తన ఇంటి సమీపంలో గల డ్రైనేజీలో విపరీతంగా పేరుకుపోయిన చెత్తను వేతనం చెల్లించి కూలీలచే తొలగించారు. పంచాయితీ కార్యదర్శి ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తన ఇష్టారీతిన వ్యవహరిస్తుంటారని పలువురు ఆరోపిస్తున్నారు.

**-చర్యలు తీసుకొంటాం...**

ఈ విషయంపై ఎంపిడిఓ కుడుముల. విజయ భాస్కర్‌రెడ్డి వివరణ కోరగా సమస్యలను ఎంపిఓకు గానీ నా దృష్టికి తీసుకొస్తే విచారించి తగు చర్యలు తీసుకొంటామని చెప్పారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను మాకు సమాచారం అందజేస్తే పరిష్కరిస్తామన్నారు.

## ఎంఎల్‌ఏ కూనంనేనికి ఆహ్వానం

**- పాల్వంచ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు**



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ వర్తక సంఘం ఆధ్వర్యంలో గత 50 సంవత్సరాలుగా అంగరంగ వైభవోపేతంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా నేడు బుధవారం జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ కమీషనర్ సుజాత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ ఎస్‌ఐ కే. సుమన్ లను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటి అధ్యక్షులు చలవాది ప్రకాష్, ఉప్పుశెట్టి రాకేష్, నాయకులు గూడెపు శ్రీనివాస్, ఇప్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ గిరిజన మహిళపై అత్యాచారం చేసిన దోషును కఠినంగా శిక్షించి బాధితురాలిని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్ అన్నారు. స్థానిక పాల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమాయకురాలైన గొత్తికోయ ఆదివాసీ గిరిజన మహిళపై జరిగిన అత్యాచార సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది సమాజం తలదించుకునే విషయమని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవ్వ సారిక, తెల్లం కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/పాల్వంచ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ విమర్శించారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి పాల్వంచలోని డబుల్ బెడ్ రూమ్‌ల ఇండ్ల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచలో డబుల్ బెడ్ రూమ్‌లను గత ప్రభుత్వం మధ్యలోనే ఆపివేసిందని అన్నారు. వాటిని పూర్తి స్థాయిలో నిర్మించి అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని యెడల సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మైక్రో ఫైనాన్స్ వారితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు మహిళలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఎలాంటి ఒత్తిడికి గురి చేసినా పార్టీ దృష్టికి తీసుకొస్తే తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మందలపు జ్యోతి, నాయకులు దొడ్డా రవికుమార్, పొదిల తులసీరామ్, కే. సత్య, కాంతి మాధవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణేష్ విగ్రహాలనే పూజిద్దాం



**ప్రజాపక్షం/పినపాక:** గణేష్ నవరాత్రి వేడుకలు సందర్భంగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలని, పినపాక ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజస్వి అన్నారు. గణపతి నవరాత్రులు సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్ పరిధిలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో తేజస్విని మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలు నీటి వనరులను తీవ్రంగా కాలుష్యం చేస్తుండగా, వాటి రసాయనాలు జలజీవులను నాశనం చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా నీటి వనరులు కాపాడటమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని వారు తెలిపారు. గణపతి విగ్రహాలను సహజ మట్టితో తయారు చేసి, పండుగ అనంతరం గృహంలో గానీ, తోటల్లో గానీ నిమజ్జనం చేయవచ్చు అని తెలిపారు. ఇలా చేయడం ద్వారా ప్రకృతి సమతుల్యం నిలబెట్టవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు వెంకటేశ్వర్లు, అరుణ, ఎఫ్ఎస్వో వెంకటమ్మ, బీట్ ఆఫీసర్ లు రాణి, శశిరేఖ, ఆదిత్య, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.